క్లుప్తంగా

మహిళలకు చీరల పంపిణీ


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పాలిమేర హరికృష్ణ

ఏలూరు (టూటౌన్) : ఏలూరు కథోలిక్ పీఠాధిపతులు బిషప్ పాలిమేర జయరావు క్రైస్తవులకు, ఇతర పేద వర్గాలకు, ఆధ్యాత్మిక, విద్యా, వైద్యరంగాలలో సేవలందిస్తున్నారని అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్ పాలిమేర హరికృష్ణ అన్నారు. బిషప్ జయరావు పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక గన్‌బజారులో పేద మహిళలకు మంగళవారం చీరలను పంపిణీ చేశారు. హరికృష్ణ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వాలతో పాటు, సమానంగా స్వచ్ఛందంగా ఆయా బాధితులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన సంస్థ ఆర్‌సీఎం అన్నారు. అటువంటి పెద్ద సంస్థకు ఏలూరు ప్రాంత పీఠాధిపతులుగా పెద్దన్న పాత్రను బిషప్ జయరావు పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ నాయకులు పాకా ప్రభాకరరావు, జిల్లా నాయకులు బేనపల్లి లక్ష్మణరావు, గూడవల్లి శ్రీనివాస్, మందపాటి నవీన్, మేతర స్వామి, చింతాటి వెంకన్న, పాలిమేర రాజు, కర్నాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రైతులకు వ్యవసాయ సామగ్రి పంపిణీ


రైతులకు వ్యవసాయ సామగ్రి అందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్ : చొదిమెళ్లలో ప్రధానమంత్రి అనుచిత జాతి అభ్యుదయ యోజన(పీఎంఏజేఏవై) ద్వారా మంగళవారం 15 ఎస్సీ రైతులకు వ్యవసాయ సామగ్రి అందజేసినట్లు ఆర్‌బీకే గ్రామ ఉద్యాన సహాయకురాలు బి.వాసవి సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సుమారు రూ.10 వేల విలువ కల్గిన 9 రకాల నవధాన్యాలు, 15 రకాల కూరగాయ విత్తనాలు, టార్పలిన్, పసుపు జిగురు అట్టలు, లింగార్షణ బుట్టలు, 200, 100 లీటర్ల డ్రమ్ములు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఈ సామగ్రి ఉపయుక్తంగా ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బత్తిన విజయ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈఓ కోటేశ్వరరావు, ఐబీ జిల్లా ఇన్‌చార్జి సీహెచ్ సుబ్బారావు, ఉద్యాన అధికారి బి.కిరణ్, వీఆర్వో టి.వరప్రసాద్, ప్రకృతి వ్యవసాయ మండల కోఆర్డినేటర్ రాజేశ్వరి, ఐసీఆర్పీ నాగరాజు, నాగబాబు, డీబీఆర్సీ మండల కో–ఆర్డినేటర్ ఝాన్సీ పాల్గొన్నారని వివరించారు.

వరద బాధితులకు కూరగాయల పంపిణీ

కుక్కునూరు : గోదావరి వరదతో గ్రామాన్ని ఖాళీ చేసి రాయికుంట పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న గొమ్ముగూడెం గ్రామస్తులకు మంగళవారం కుక్కునూరు వైఎస్సార్ సీపీ నాయకులు కూరగాయలు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు మాట్లాడుతూ పార్టీ తరుపున బాధితులకు ఎటువంటి అవసరం వచ్చినా సాయం చేసేందుకు సిద్ధంగా ఉంటామని చెప్పారు. వరద బాధితులకు ఎటువంటి అసౌకర్యం రాకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని బాధితులకు ధైర్యం చెప్పారు. అందుకే ముందస్తుగా మూడు నెలలకు సంబంధించిన బియ్యం పంపిణీ చేశారన్నారు. రాబోవు రోజుల్లో నిత్యావసరాలు పంపిణీ చేసేందుకు కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్, ఎంపీటీసీ సోడే సాధు, నాయకులు రావు వినోద్, కుచ్చర్లపాటి చిన్న నరసింహరాజు, కుచ్చర్లపాటి కృష్ణంరాజు, దేవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు.. నిస్వార్థ సేవకులు

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఒక్క రూపాయి అవినీతి లేకుండా కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తున్న ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది. వలంటీర్ సేవలపై ప్రతిపక్ష నాయకులు పవన్‌కళ్యాణ్, చంద్రబాబు చేస్తున్న ఆరోపణలను ప్రజలు కొట్టిపారేస్తున్నారు. నిస్వార్థంగా పేదలకు సేవ చేస్తున్న వలంటీర్లపై ఇష్టమొచ్చినట్టు ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరిస్తున్నారు. బాధ్యత కల్గిన పార్టీ నాయకులు ఎలాంటి ఆధారాలు లేకుండా వలంటీర్లపై ఆరోపణలు చేయడం వల్ల పేదలకు నష్టం జరుగుతుందంటున్నారు.

ఏలూరులో పింఛన్ అందిస్తున్న వలంటీర్


నిజాయతీ కలిగింది వలంటీర్ వ్యవస్థ



వలంటీర్లు ఒక్క రూపాయి తీసుకోకుండా పేదలకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నారు. వాళ్లను నిందించడం మంచిది కాదు. టీడీపీ ప్రభుత్వం హయాంలో నా కొడుకు కులం సర్టిఫికెట్ కావాలని తహసీల్దార్ కార్యాలయానికి వెళితే, టీసీ కావాలన్నారు. లేదంటే కుటుంబ సభ్యుల కులం సర్టిఫికెట్ జత చేయాలన్నారు. రెండు జత చేసి దరఖాస్తు చేస్తే నిబంధనల ప్రకారం నెలరోజులు ఆగాలి. కాని 10రోజుల్లో ఇస్తామన్నారు. ఇప్పుడు వలంటీర్ ఇంటికే వచ్చి మీకు కులం, నివాస ధ్రువపత్రం కావాలా అని అడిగి మాతో దరఖాస్తు చేయించాడు. మరుసటి రోజే అధికారులచే అందించాడు.

– ఘంటసాల సింహాచలం, కోమటిలంక

సంక్షేమ పథకాల వారధులు



వలంటీర్ వల్లనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మా కుటుంబానికి అందాయి. నా వద్ద సరైన పత్రాలు లేకపోయినప్పటికీ, వలంటీర్ వచ్చి పత్రాలు రాసిపెట్టి, పథకాల కోసం దరఖాస్తు చేయించి అధికారుల నుంచి మంజూరు చేయించాడు. ఇప్పుడు నా కుటుంబ సభ్యులకు ఇంటి స్థలం, పింఛన్ వచ్చిందంటే.. వలంటీర్ పుణ్యమే. ముఖ్యమంత్రి చేపట్టిన పథకాలు నాలాంటి పేదలకు సక్రమంగా అందుతున్నాయంటే ప్రధాన కారణం వలంటీర్ వ్యవస్థ.

– టి కృష్ణ, వైఎస్సార్ కాలనీ

వలంటీర్లపై ఆరోపణలు బాధాకరం



రెండురోజుల క్రితం వలంటీర్ నా ఇంటికి వచ్చి, దరఖాస్తు పూర్తి చేశాడు. మరుసటి రోజు జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు కులం, నివాసం సర్టిఫికెట్ అందించారు. ప్రభుత్వ సేవలు ఇంత వేగంగా, ఇంటికే చేరుతాయని నేను ఎన్నడూ అనుకోలేదు. గతంలో సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాను. దరఖాస్తు చేస్తే, కనీసం 10 రోజుల తర్వాత రమ్మని అధికారులు చెప్పారు. వలంటీర్ సేవకు ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలి. వలంటీర్లపై ఆరోపణలు చేయడం బాధాకరం.

– వి పార్వతి, వైఎస్సార్ కాలనీ

పేదల కోసం వలంటీర్లు



ఎవరు ఏం మాట్లాడిన సరే.. వలంటీర్ల సేవలు మాకు కావాలి. వలంటీర్ లేకపోతే పథకాలు గూర్చి మాకు ఎవరు వివరిస్తారు. మాతో దరఖాస్తు చేయించి మాకు పథకం వచ్చిందో లేదో ఎవరు చెబుతారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసమే వలంటీర్లను పెట్టారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నాకు పథకాలు అందించాడు. నాలాంటి ఎందరో పేదలు అమ్మఒడి, జగనన్న దీవెన, చేయూత పథకాలు అందుకుంటున్నారంటే వలంటీర్ల వల్లనే. వలంటీర్లు గురించి తెలియని వాళ్లే ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతారు.

– బలే దుర్గ, కోమటిలంక

డ్వాక్రా మహిళలకు నాల్గవ విడత వైఎస్సార్ సున్నా వడ్డీ అమలు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు అబ్బయ్యచౌదరి


కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు ఎమ్మెల్యే

దెందులూరు: డాక్టర్ వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం డ్వాక్రా మహిళలకు వరమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబంలో తోబుట్టువులా మహిళల ఆర్థికాభివృద్ధి, భద్రతతో కూడిన జీవన విధానం కల్పించే దిశగా పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో దెందులూరు మండలంలో 1,751 డ్వాక్రా సంఘాలకు రూ.244.44 లక్షలు, ఏలూరు రూరల్ మండలానికి 842 గ్రూపులకు రూ. 90.22 లక్షలు, పెదపాడు మండలానికి 1,629 గ్రూపులకు రూ. 217.72 లక్షలు, పెదవేగి మండలానికి 2,186 గ్రూపులకు రూ. 299.19 లక్షలు సున్నా వడ్డీ లబ్ధి చేకూరనుంది. నియోజకవర్గంలో 6,408 స్వయం సహాయక సంఘాలకు రూ. 849.58 లక్షలు లబ్ధి నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26న ఉదయం 11 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నాల్గవ విడత వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని ప్రారంభించి అక్కచెల్లెమ్మలకు లబ్ధి అందిస్తారని అన్నారు. నాల్గవ సంవత్సర వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని ఈ నెల 26న ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నిర్వహిస్తారని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వివరించారు. రాష్ట్రంలో డ్వాక్రా స్వయం సహాయక సంఘాలతో పాటు దెందులూరు నియోజకవర్గంలో 6,408 స్వయం సహాయక సంఘాల అక్కచెల్లెమ్మలకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలకు ఇంటరేక్టివ్ ప్యానల్ బోర్డులు

పెదపాడు: పాఠశాలల్లో ఇంటరేక్టివ్ ఫ్యానల్ బోర్డులను ఏర్పాటు చేసినట్టు పెదపాడు ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు 10 ఇంటరేక్టివ్ ప్యానల్ బోర్డులను ప్రభుత్వం సరఫరా చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బోధన చేసేందుకు, విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం పెంచేందుకు, చదువుకోవాలనే కాంక్షను పెంచేందుకు ఈ బోర్డులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

గ్రామ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమడోలు: మండలంలో ఖాళీగా ఉన్న 3 గ్రామ వలంటీర్ల పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి అన్నారు. అంబర్‌పేటలో రెండు, సూరప్పగూడెంలో ఒక పోస్టు ఖాళీగా ఉందన్నారు. అంబర్‌పేటలో రెండు పోస్టులను బీసీ ఏ (పురుషుడు), బీసీ బీ (పురుషుడు), సూరప్పగూడెంలోని ఒక పోస్టును బీసీ ఏ మహిళలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండాలని, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు గల వారు ఈనెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆగస్టు 2న ఇంటర్వ్యూలను నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు.

జగనన్న సురక్ష.. సూపర్ సక్సెస్

- పండుగలా జగనన్న సురక్ష శిబిరాలు
- ఏలూరులో 53,854 మందికి మేలు
- రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సేవలు


జగనన్న సురక్ష ప్రారంభ సభలో లబ్ధిదారునికి రైస్‌కార్డ్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ళనాని తదితరులు (ఫైల్)

ఏలూరు టౌన్ : ప్రజలకు మేలు చేయాలనే తపన.. ఆకాంక్ష ఉంటే చాలు అద్భుతాలు చేయవచ్చని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపిస్తున్నారు. ప్రజలకు అత్యుత్తమ స్థాయిలో సేవలు అందిస్తూ శభాష్ అనేలా చేస్తున్నారు. ఐదేళ్లకో మారు ఎన్నికలప్పుడే జనం వద్దకు వెళ్లే పాత చింతకాయ పచ్చడి విధానానికి ఫుల్‌స్టాప్ పెట్టేశారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు నిత్యం ప్రజల రక్షణ, సంరక్షణ, బాగోగులు చూడాలనే నూతన సంస్కృతికి నాంది పలికారు. ఏడాదిన్నరగా గడపగడపకు మన ప్రభుత్వంతో ప్రతి ఇంటి తలుపు తట్టేలా ఎమ్మెల్యేలు, అధికారులను పంపగా... జగనన్నకు చెబుదాం అంటూ మరో కార్యక్రమం, తాజాగా జగనన్న సురక్షతో జనంతో మమేకం అయ్యేలా రూపుదిద్దారు. ప్రతి కుటుంబానికి ఏమి కావాలో తెలుసుకుంటూ కుటుంబ పెద్దలా అండగా నిలబడుతున్నారు... సీఎం వైఎస్ జగనన్న.

విజయవంతమైన జగనన్న సురక్ష

ఏలూరు నియోజకవర్గంలో జగనన్న సురక్ష కార్యక్రమం సూపర్ సక్సెస్ అయ్యింది. ఏలూరు కబాడీగూడెంలో జూలై 4న తొలి సురక్ష శిబిరాన్ని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని ప్రారంభించారు. పండుగ వాతావరణంలో జగనన్న సురక్ష శిబిరాలు నగరంలో ఏర్పాటు చేశారు. ఐదు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా గుర్తిస్తూ జూలై 22వ తేదీ వరకూ సుమారుగా 16 సురక్ష శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒకవైపు కార్పొరేటర్లు నాయకత్వంలో గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు వారం రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఏమి కావాలో తెలుసుకుని మరీ ఆన్‌లైన్ దరఖాస్తు చేసి, సురక్ష శిబిరంలో అందజేశారు. ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహసీల్దార్ సోమశేఖర్, డిప్యూటీ కమిషనర్ ఎన్.రాధ, పీవో కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది, కోఆప్షన్ సభ్యులు పెదబాబు, డిప్యూటీ మేయర్లు సమష్టి కృషితో జగనన్న సురక్షలో వేలాదిమందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఏలూరు నగరంలో జగనన్న సురక్షకు క్లస్టర్ ఇన్‌ఛార్జులుగా మోటమర్రి సదానందం, బండారు కిరణ్‌కుమార్, తుమరాడ స్రవంతిని నియమించారు. ఏలూరులో జగనన్న సురక్ష ప్రజలకు మేలు చేసిందని చెప్పటంలో సందేహం లేదనే చెప్పాలి.

ఏలూరు నగరంలో జగనన్న సురక్షలో ఇలా

ఏలూరు నగరంలో 16 రోజులపాటు సుదీర్ఘంగా సాగిన జగనన్న సురక్ష శిబిరాల్లో భారీ ఎత్తున ప్రజలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. గతంలో రోజుల తరబడి కార్యాలయల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితికి చెక్ పెడుతూ .. దరఖాస్తు చేసిన మూడు రోజులకే లబ్ధిదారుని చేతిలో సర్టిఫికెట్‌ను పెట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఈ విధానంపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతుంది.

ఏలూరు నగరంలో మొత్తం

ధ్రువీకరణ పత్రాలు	– 53,854
ఆదాయ ధ్రువీకరణ పత్రాలు	– 10,867
కుల ధ్రువీకరణ పత్రాలు	– 31,174
ఆధార్ అప్‌డేట్ రిక్వెస్ట్	– 3091
రైస్‌కార్డులలో మార్పులు, చేర్పులు	– 230
ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు (ఎఫ్ఎంసీ)	– 46
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు	– 16
డెత్ సర్టిఫికెట్లు	– 01
బర్త్ సర్టిఫికెట్లు	– 01
ఇతర ధ్రువీకరణ పత్రాలు	– 8,428

సీఎం జగన్‌తో భరోసా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు భరోసా వచ్చింది. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని నాయకత్వంలో నగరంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి, సంక్షేమ పథకాలు పక్కాగా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. తాజాగా జగనన్న సురక్షతో ప్రతి కుటుంబానికీ ఏమి కావాలో తెలుసుకుని మరీ వారి సమస్యలను పరిష్కరిస్తున్నారు. ప్రతి ఇంటిలోనూ ప్రజలకు లబ్ధి చేకూరేలా కార్యక్రమాన్ని చేయటం సంతోషం.

– గుడిదేశి శ్రీనివాసరావు, ఏలూరు డిప్యూటీ మేయర్


ప్రజా ప్రభుత్వమంటే ఇదే



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు మేలు చేయాలనే తపనతో పనిచేస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వ పాలన చేరువ చేయటమే కాదు, అవినీతి రహిత సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని సారథ్యంలో ప్రజా ప్రభుత్వమంటే ఇదే అనేలా సేవలు అందిస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వేలాది మందికి ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా రూపాయి ఖర్చు లేకుండా అందజేశారు.

– మోటమర్రి సదానందకుమార్, జగనన్న సురక్ష, క్లస్టర్–1 ఇన్‌ఛార్జ్

భారీగా ధ్రువీకరణ పత్రాల మంజూరు



ఏలూరు నగరంలో 16 రోజులపాటు చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సుమారుగా 53వేలకు పైగా ధ్రువీకరణ పత్రాలు అందజేశాం. ప్రతి ఇంటికీ వెళ్లి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయటం, జగనన్న సురక్షలో వాటిని అందజేయటం జరిగింది. సుమారుగా 42వేల మంది ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందుకున్నారు.

– సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు నగర కమిషనర్

బాధితుల ఖాతాలో నష్టపరిహారం జమ

కుక్కునూరు : గత సంవత్సరం జూలై నెలలో వచ్చిన గోదావరి వరద కారణంగా ఇళ్లు కూలి నిరాశ్రయులైన బాధిత కుటుంబాల ఖాతాలలో మంగళవారం నష్టపరిహారాన్ని అధికారులు జమచేశారు. గతంలో కొందరికి నష్టపరిహారం అందినప్పటికి మరికొందరికి జమకాలేదు. దీంతో ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చేశారు. దీంతో బాధితుల ఖాతాలలో నష్టపరిహారం జమైంది. కాగా ఇంకా జమకాని వారెవ్వరైనా ఉంటే వారికి కూడా ఒకటి, రెండు రోజుల్లో జమచేస్తారని అధికారులు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే అసత్య ప్రచారం

పచ్చనేతలపై ఎంపీపీ శ్రీనివాసరాజు ధ్వజం


జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్ : చంద్రబాబు పాలనలో ఒక్క పంచాయతీకి రూ.10 లక్షలు మంజూరు చేస్తే పచ్చనేతలు గొప్పలు చెప్పుకున్నారని, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకొక్క పంచాయతీకి రూ.10 కోట్లు ఖర్చు చేస్తుంటే, ఓర్వలేక అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఏలూరు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు దుయ్యబట్టారు. మంగళవారం ఏలూరు మండలం చాటపర్రులో సర్పంచ్ గుడిపూడి రఘు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన కోట్ల రూపాయల నిధులతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టించారని కొనియాడారు. చాటపర్రులో అబ్బయ్యచౌదరి చేపట్టిన రెండు కిలోమీటర్ల సీసీరోడ్లు, 5 వేల మంది పేదలకు ఇంటింటికీ కుళాయి, రూ 40 లక్షల మండలపరిషత్ నిధులతో గ్రావెల్ రోడ్లు, సచివాలయ భవన నిర్మాణం పనులు పచ్చనేతలకు కనబడడం లేదా అని ఎద్దేవ చేశారు. మొత్తంగా చాటపర్రులో సంక్షేమం, అభివృద్ధి పేరిట ప్రభుత్వం రూ. 8 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రూ.25 కోట్లతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కై కలూరు రోడ్డు, శ్రీపర్రు కాజ్‌వే అభివృద్ధి చేస్తుంటే, రోడ్డుపై గుంతలు పద్దాయంటూ టీడీపీ నాయకులు చెప్పడం సిగ్గు చేటు అన్నారు. అభివృద్ధిపై ప్రతిపక్షాలకు ప్రజలే సమాధానం చెబుతారన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ అభివృద్ధిపై చర్చిందానికి సిద్ధం అంటూ సవాల్ విసిరారు. అసత్య ఆరోపణలు చేస్తే గట్టిగా బుద్ధి చెబుతామని వడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు హెచ్చరించారు.

3 వేల ధ్రువపత్రాలు మంజూరు

మండల ప్రత్యేక అధికారి, జిల్లా డీఆర్వో ఎంవీఎస్ఎన్ మూర్తి పరివేక్షణలో అధికారులు 3 వేల మందికి పైగా ఆర్జీదారులకు అడంగళ్ బి1 పత్రాలు, కులం, నివాస తదితర ధ్రువీకరణ పత్రాలు అందించారు. మొత్తంగా మండల గ్రామాల్లో 16 వేల మందికి ధ్రువపత్రాలు అందించామని తహసీల్దార్ బి సోమశేఖర్ వెల్లడించారు. దీనికి ముందు ఎంఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది గ్రామానికి 100 మొక్కలు అందించగా, అధికారులు కొన్ని నాటారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ బోడిగడ్డ కుమారిశ్రీనివాస్, చాటపర్రు సొసైటీ చైర్మన్ కోటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ వై సుజాత, ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, పీఆర్, ట్రాన్స్‌కో ఏఈ కృష్ణమోహన్, శ్రీనివాస్, ఎంఏఓ జీవనసంధ్య, పశువైద్యురాలు లక్ష్మీ, కార్యదర్శి రవీంద్రతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు, పరుశరాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..


బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	32
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	25
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	31
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	33

మణిపూర్‌లో విధ్వంసకాండను అరికట్టాలి

ఏలూరు (టూటౌన్) : మణిపూర్‌లో కుకీ ఆదివాసులు, ప్రజలపై జరుగుతున్న విధ్వంసకాండను, మహిళలపై అత్యాచారాలు, హత్యలను కేంద్రంలోని మోదీ, షా ప్రభుత్వం అరికట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు డిమాండ్ చేశారు. స్థానిక ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ గోడౌన్ ఎదురుగా ఉన్న రోడ్డుపై కార్మికులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రమైన మణిపూర్‌లో కుకీ ప్రజలపై ఆర్ఎస్ఎస్ వాదులు దాడులు చేయడం, మహిళలను కాల్చి చంపడం, వివస్త్రలను చేయడం అత్యంత హేయమైన చర్యగా విమర్శించారు. దీనిపై సుప్రీంకోర్టు బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినా కేంద్ర ప్రభుత్వంలో కదలిక లేకపోవడం సిగ్గుచేటన్నారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని తక్షణం భర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యర్రా శ్రీనివాసరావు, రాచీటి జాన్, పద్మ, రాములమ్మ, సూర్యవతి, పండు, సింహాచలం, కొండ రాము, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ గోడౌన్ కార్మికులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఏలూరు (టూటౌన్): మణిపూర్‌లో ఆదివాసి మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేయాలని ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కోకన్వీనర్ ఆగొల్లు వెంకట కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. మణిపూర్‌లో అఘాయిత్యాలను బయట ప్రపంచానికి తెలియకుండాఈ బుల్డోజర్ ప్రభుత్వం అక్కడ ఇంటర్నెట్ సౌకర్యాన్ని తొలగించడం సిగ్గు చేటన్నారు.